# ఆనందం డబుల్

కేసీఆర్‌నగర్‌ను ప్రారంభించిన సీఎం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను(కేసీఆర్ నగర్) గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఆ ప్రాంగణంలోని పైలాన్‌ను మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ విజయలక్ష్మిలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం బ్యాటరీ వాహనంపై ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు రెండు పడకల ఇళ్ల కేటాయింపు పత్రాలను కేసీఆర్ అందించారు. అనంతరం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు.


ఇంటిలో పూజ చేసుకుంటున్న సుజాత కుటుంబం

### కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

సొంతఇంటి కలను నిజం చేసిన కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. నేను ఓ పరిశ్రమలో పని చేస్తున్నా. నా భర్త రాజు డ్రైవర్. 2016లో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించడం ఆనందంగా ఉంది.

- చాకలి సుజాత, కాటేదాన్ (రాజేంద్రనగర్)

### చాలా ఆనందంగా ఉంది


మాకు డబుల్ బెడ్ రూం ఇంటిని కేటాయించడం ఆనందంగా ఉంది. నా భర్త హనుమంతు నాయక్ డ్రైవర్. నేను కూలికి వెళ్తాను. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మా సొంత ఇంటి కలను నిజం చేసింది.

- కేతావత్ కీర్తి, రాజేంద్రనగర్

### పేదోళ్ల ప్రభుత్వం


పేదోళ్ల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఇది పేదోళ్ల ప్రభుత్వం కాబట్టే మాకు రెండు పడకల ఇల్లు వచ్చింది. మంచి విలువైన స్థలంలో ఇళ్లను ఇచ్చారు.

- శారద, గచ్చిబౌలి (శేరిలింగంపల్లి)

### మా ఓటు కేసీఆర్‌కే..


ఏళ్ల తరబడి అద్దె ఇంటిలో ఉంటున్నాం. అద్దెలు కట్టలేక ఇబ్బంది పడ్డాం. నా భర్త ఫారుఖ్ ఆటో డ్రైవర్. సంపాదించినదంతా అద్దె కట్టడానికే సరిపోయేది. 2020లో ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్నాం. ఇప్పుడు మా సొంత ఇంటి కల నిజమైంది. మా ఓటు కేసీఆర్‌కే వేస్తాం.

- ఆసియాబేగం, గోకుల్‌నగర్ (పటాన్‌చెరు)

### సొంతిల్లు కల నెరవేరింది


పేదోళ్ల కష్టం తెలిసిన వ్యక్తి కేసీఆర్. ఈ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంది. నా భర్త చనిపోవడంతో కూలీకి వెళ్తూ జీవనం సాగిస్తున్నా. కేసీఆర్ ప్రభుత్వం సొంత ఇంటి కలను నిజం చేసి మా జీవితంలో ఆనందం నింపింది.

- రేణుక, అంబేద్కర్‌కాలనీ (పటాన్‌చెరు)

# గల్లీగల్లీలో పాదయాత్ర చేశా

పటాన్‌చెరుతో అనుబంధాన్ని పంచుకున్న కేసీఆర్

పటాన్‌చెరు: పట్టణంలోని గెస్ట్‌హౌస్‌లో మూడు రోజులు ఉన్నానని, గల్లిగల్లీలో తిరిగినట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తుచేశారు. అప్పటి ఎమ్మెల్యే సదాశివరెడ్డితో కలిసి పట్టణ సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ ప్రాంత సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గురువారం పట్టణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ స్థానిక నేతలను పేర్లతో పిలుస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, మాజీ ప్రొటెం స్పీకర్ భూపాల్‌రెడ్డి పేర్లు ప్రస్తావిస్తూ వారు విన్నవించిన సమస్యలను వివరించారు. పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్ కావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనను కలిసినప్పుడల్లా కోరారన్నారు. పటాన్‌చెరు వరకు మెట్రో కావాలని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ కోరారని తెలిపారు. సీఎం ప్రసంగిస్తున్నప్పుడు మహిపాల్‌రెడ్డి పేరు ప్రస్తావించిన ప్రతీ సందర్భంలోనూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సభలో పెద్దఎత్తున ప్రతిస్పందించారు. మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో పటాన్‌చెరు అభివృద్ధి పథంలో ముందుకుపోతోందని కేసీఆర్ అన్నప్పుడు సభలో ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే తన ప్రసంగంలో కోరిన అన్ని సమస్యలకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అప్పటికప్పుడు వరాలు కురిపించారు. సభలో తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరులో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. గతంలో తాను ఎంపీటీసీగా ఉన్న కాలంలో కేసీఆర్ అప్పటి ప్రభుత్వంలో మంత్రి హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించారని గుర్తు చేశారు. అందుకే ఎక్కువ విషయాలు చెప్పనంటూనే ఈ ప్రాంత వాసుల కోరికలను ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రాంతంలో పాలిటెక్నిక్ కాలేజీ కావాలని కోరారు. మెట్రో రైలు ఇస్నాపూర్ వరకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్‌నగర్‌లో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.


సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

### పట్టణమంతా గులాబీమయం

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటాన్‌చెరు పట్టణమంతా గులాబీమయమైంది. సీఎంను స్వాగతించేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలతో పట్టణం కిటకిటలాడింది. బస్టాండ్ పక్కన నుంచి సభాస్థలి వరకు నాయకులు, కార్యకర్తలతో నిండిపోయింది. ముత్తంగి నుంచి పట్టణం వరకు ఎటు చూసినా గులాబీ జెండాలు, స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలే కనిపించాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు కదిలివచ్చారు. కాగా సభాస్థలికి సీఎం గంటన్నర ఆలస్యంగా వచ్చారు. జాతీయ రహదారి పొడవునా మైక్‌లు ఏర్పాటు చేశారు. కళాకారుల బృందాల పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రెస్‌గ్యాలరీలో విలేకరులు కూర్చునేందుకు సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో కొందరు నిలబడే వార్తలు సేకరించాల్సి వచ్చింది.

## క్లుప్తంగా

### కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 80, బెండ 50, కాకర 60, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 110, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 70, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 150.

### బీఆర్‌ఎస్ నాయకుల ర్యాలీ


ర్యాలీగా బయలుదేరిన మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్‌ఎస్ నాయకులు

రాయదుర్గం: నగరంలో నిర్మించిన అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి గురువారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ నుంచి బయలుదేరి వెళ్ళారు. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్ళారు.

### పీసీసీ అధికార ప్రతినిధిగా డా.లింగం యాదవ్

హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి అవకాశం


రాయదుర్గం: పీసీసీ అధికార ప్రతినిధిగా డాక్టర్ బి.లింగంయాదవ్‌ను నియమిస్తూ పీసీపీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం నియామకపత్రాన్ని అందించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని తిరిగి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

### నెహ్రూనగర్‌లో 'ఇంటింటికీ బీజేపీ'


నెహ్రూనగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

శేరిలింగంపల్లి: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ నెహ్రూనగర్‌లో బీజేపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి ప్రసాద్, జగదీష్, రాజు, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆహ్వానం పంపారు.. అరెస్ట్ చేశారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో రెండు పడకల ఇళ్ల ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రాక సందర్భంగా పోలీసులు స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్లు మయూరి, రాంసింగ్‌ను, నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. కొల్లూర్ కౌన్సిలర్‌లు మయూరి, రాంసింగ్‌లకు ఆహ్వానం ఉన్నా పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో ఇంటి నుంచి బయటకు రాలేదు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మయూరి మాట్లాడుతూ సీఎం సభ సందర్భంగా తాము కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. తమకు ఆహ్వానం పంపి హౌస్ అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని తాము వినతిపత్రం అందజేయాలనుకున్నామని తెలిపారు.

### కూతురు అదృశ్యమైందని...

పటాన్‌చెరు టౌన్: కూతురు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామానికి చెందిన షేక్ మోయిన్ పాషా కూతురు షేక్ హీన(19) ఇంటర్ వరకు చదివి, ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటుంది. ఈ నెల 21వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన తండ్రి కూతురు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## స్మార్ట్ వాటర్ మీటర్‌తో నీటి ఆదా

- హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ విద్యార్థి అంకిత్‌రాజ్ రూపకల్పన
- టీఎస్ పీసీబీ ఎకో ఛాంపియన్స్ హ్యాకథాన్‌లో 3వ బహుమతి

రాయదుర్గం: నీటి వినియోగం తగ్గింపు కోసం స్మార్ట్ వాటర్ మీటర్ నెట్‌వర్క్ నిర్వహణను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ప్రతిపాదించారు. అంకిత్‌రాజ్ హెచ్‌సీయూలో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ చేస్తున్నాడు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) నీటి వినియోగం తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తగ్గింపు రెండు అంశాల కింద ముఖ్యమైన సమస్యలను ఛేదించడానికి వినూత్న ఆలోచనలు, పరిష్కారాలను ఆహ్వానించింది. అందుకోసం 'ఎకో చాంపియన్స్ హ్యాకథాన్'ను నిర్వహించింది. ఇందులో అంకిత్‌రాజ్ స్మార్ట్ వాటర్ మీటర్ నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్' పేరుతో థీసిస్ సమర్పించారు. ఇందులో సుమారు 300 బృందాలు పాల్గొన్నాయి. అందులో అంకిత్‌రాజ్ మూడవ బహుమతి పొంది రూ.20వేల నగదు పురస్కారం అందుకున్నారు.

## ట్రిపుల్‌ఐటీ -ఐహబ్ డేటా ఆధ్వర్యంలోఏఐ/ఎంఎల్‌పై శిక్షణ

అక్టోబర్ 3నుంచి 18వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఐహబ్ డేటా కలిసి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/ మెషిన్ లెర్నింగ్‌పై రెండు వారాల ఎగ్జిక్యూటివ్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పరిశోధనా సంస్థలు లేదా ఇతర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న యువ శాస్త్రవేత్తలు/విశ్లేషకుల కోసం ఉద్దేశించబడిందని నిర్వాహకులు తెలిపారు. ఏఐ/ఎంఎల్ పద్ధతులు, ఏఐ/ఎంఎల్ సాధనాలు/ లైబ్రరీల వినియోగం, ప్రజా వనరుల వినియోగం( డేటాసెట్‌లు, శిక్షణ పొందిన నమూనాలు), సమకాలీన సమస్య తదితరాలను పాల్గొనేవారికి పరిచయం చేస్తారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ ఆర్ అండ్ డీ డీన్ ప్రొఫెసర్ సీవీ జవహర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అప్లై చేసుకోవడానికి జూలై 31వ తేదీ ఆఖరని ఆయన పేర్కొన్నారు.

## ఆరంభ టౌన్‌షిప్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

హెచ్‌సీయూ డిపో అధికారులకు కాలనీవాసుల వినతి

రాయదుర్గం: రాజీవ్ స్వగృహ ఆరంభ టౌన్‌షిప్‌కు ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ కాలనీవాసులు గచ్చిబౌలి హెచ్‌సీయూ డిపో అధికారులకు గురువారం వినతిపత్రాన్ని అందించారు. టౌన్‌షిప్‌లో దాదాపు 5వేల మంది నివాసముంటున్నారని, కాలనీ నుంచి ఎక్కడికి వెళ్ళాలన్నా ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డిపో అధికారులను కలిసిన వారిలో ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర రాథోడ్, రాజేష్, సాయిరామ్, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఆరంభ టౌన్‌షిప్‌వాసులు

## గౌలిదొడ్డి విద్యార్థినులకు అభినందన


ఉన్నతాధికారులతో గౌలిదొడ్డి గురుకుల విద్యార్థినులు, ప్రిన్సిపల్ తదితరులు

రాయదుర్గం: ఇటీవల నీట్, ఐఐటీ ఫలితాల్లో రాణించిన గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక కళాశాల విద్యార్థినులు, ప్రిన్సిపల్ శారద, ఓపీ బీసీ సమన్వయకర్త వెంకట రామనర్సయ్యలు గురుకుల సంస్థ ఉన్నతాధికారులను కలిశారు. గురువారం నగరంలో ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి రోనాల్డ్ రోస్, రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారులు నాగకళ్యాణి, డాక్టర్ శారదావెంకటేష్, ఓఎస్‌డీ రంగారెడ్డిలను కలిశారు. ఎంబీబీఎస్, ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థినులను ఉన్నతాధికారులు అభినందించి వారికి బహుమతులు అందించారు.

### సీసీ రోడ్డు పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు, సంఘమిత్ర స్కూల్ వద్ద చేపడుతున్న యూజీడీ, సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు రమేష్, హనుమంత్‌రావు, సుబ్రహ్మణ్యం, విజయ్, ప్రదీప్, శివరామ రాజు పాల్గొన్నారు.

### దశాబ్ది పేరుతో బీఆర్‌ఎస్ ప్రచారం

పటాన్‌చెరు టౌన్: దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి, దశాబ్ది దగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జైపాల్ రెడ్డి, ఇస్నాపూర్ ఎంపీటీసీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ నుంచి హజ్‌యాత్రకు బయల్దేరిన వారికి వీడ్కోలు చెబుతున్న కుటుంబ సభ్యులు

### ఉద్యమకారులకు సన్మానం


గచ్చిబౌలి: తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. మియాపూర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బండి రమేష్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఆర్‌కే సాయి, తెప్ప బాలరాజు ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, బాబుమియ, ముక్తార్ జమీర్, శ్రీకాంత్, మహేష్, ఎల్లన్న, పాషా,అంజద్ అమ్ము గోవిందాచారి, రాజేందర్, సాంబయ్యచారి, మధుకర్, ఎం డిగోస్, సంతోష్‌రెడ్డి, షేక్ జమీన్, షరీఫ్, ఉమేష్, నర్సింహ నాగరాజు పాల్గొన్నారు.

### అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించండి


సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పేదలందరికీ రెండు పడకల ఇళ్లు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి గురువారం సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు పడకల ఇళ్ల కేటాయింపులో అర్హులైన స్థానిక పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. తెల్లాపూర్‌లోని వనం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్‌ను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

### అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.

## అమరులను స్మరించుకోవడం మన విధి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ముగింపు వేడుకల సందర్భంగా తెలంగాణ తొలి, మలి దశల్లో అసువులు బాసిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి త్యాగాలను స్మరిస్తూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు హమీద్ పటేల్, నార్నే శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి ఉద్యమకారులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఎంతోమంది అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలు వదలిన అమరుల త్యాగాలను భవిష్యత్తు తరాలకు చాటే అద్భుత నిర్మాణం తెలంగాణ అమరుల స్మారకం అని పేర్కొన్నారు. అమరులను స్మరించుకోవడం మన విధి అని, ఎందరో అమరుల త్యాగ ఫలితమే నేడు తెలంగాణ రాష్ట్ర ఫలం అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఎస్ఎఫ్ బీబీక్యూలో ఆదర్శ్ చిన్నారుల సందడి

గచ్చిబౌలి: ఏన్షియంట్ స్టోన్ ఫ్లేమ్స్ (ఏఎస్ఎఫ్) బీబీక్యూ, గ్రిల్ రెస్టారెంట్‌ను ఆదర్శ ఫౌండేషన్ చిన్నారులు గచ్చిబౌలిలో గురువారం ప్రారంభించారు. ఏఎస్ఎఫ్ బీబీక్యూ, గ్రిల్ రెస్టారెంట్ మేనేజింగ్ పార్ట్‌నర్ అభిలాష్ కుమార్ యలమంచిలి మాట్లాడుతూ పురాతన కాలంలో రాళ్ల మధ్య వంట చేసేవారని అదే కాన్సెప్ట్‌తో లావా స్టోన్‌ను ఎంచుకున్నామని పేర్కొన్నారు. లావా స్టోన్‌తో పాటు ఆహారాన్ని టేబుల్ పైకి అందిస్తారు. కిడ్స్ కోసం ప్రత్యేక సెక్షన్ ఉంటుందన్నారు.రెస్టారెంట్ విజనరీ డైరెక్టర్లు శ్రీహరిత, మౌనిక గార్లపాటి, హరి జీరెడ్డి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అమరుల ఆశయ సాధన దిశగా సాగాలి

- ఏసీపీ మట్టయ్య
- తెలంగాణ అమరులకు సైబరాబాద్ పోలీసుల నివాళి


సైబరాబాద్ కమిషనరేట్‌లో అమరవీరులకు నివాళులు అర్పించిన పోలీసు అధికారులు, సిబ్బంది

రాయదుర్గం: అమరుల ఆశయాల సాధన దిశగా ముందుకుసాగాలని ఏసీపీ మట్టయ్య సూచించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని లాన్‌లో తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మట్టయ్య మాట్లాడుతూ అమరవీరుల త్యాగ ఫలం, ఉద్యమకారుల పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ముఖ్యంగా తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, ఆర్ఐ అడ్మిన్ అరుణ్‌కుమార్, ఆర్ఐ హిమకర్, ఆర్ఐ యాదయ్య, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చకుండా ఉత్సవాలా..?

శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ధర్నా


శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జెరిపాటి జైపాల్ ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ దశాబ్ది దగా పేరిట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజా ధనం ఖర్చు చేస్తుందని విమర్శించారు. కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి, పోడు భూముల పట్టాలు, రైతు రుణమాఫీ తదితర హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని నెరవేర్చకుండా ఉత్సవాలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.